ప్రజాశక్తి
సోమవారం 15 డిసెంబర్ 2025 5 అనంతపురం







అనంతపురంలో ఐలు, జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు హాజరైన ప్రముఖులు

సదస్సులో ప్రసంగిస్తున్న రిటైర్డ్ జడ్జి కె.చంద్రు

బతుకు బొగ్గుపాలు..!



బొగ్గులు కాల్చిప్రాంతంలో వేసుకున్న గుడారాలు... తరలించడానికి సిద్ధం చేసిన బొగ్గులు..

- వలస కూలీల అవస్థలు
- జనావాసాలకు దూరంగా నివాసం
- పాత సిమెంట్ సంచులే నివాసాలు
- ఏడాది పొడవునా బొగ్గులు కాలుస్తూనే జీవనం
- మహారాష్ట్ర నుంచి వలస వచ్చిన కుటుంబాలు
- చదువులకు పిల్లలు దూరం

ఉన్న ఊరిలో పని దొరక్కా.. దొరికిన చిన్నపాటి పనితో కుటుంబాన్ని పోషించుకోలేక బతుకుదెరువు కోసం కూలీలు వలస బాటపడుతున్నారు. గ్రామాల నుంచి మొదలైన వలస రాష్ట్రాలను దాటుతోంది. వేల కిలోమీటర్లు దాటి వస్తున్నారు. ఇలా బొగ్గులు కాల్చే కూలీలు మహారాష్ట్ర నుంచి పెనుకొండ ప్రాంతానికి వలసొచ్చారు. వీరికి తాగటానికి నీళ్లు లేక.. ఉండాటానికి నీడలేక.. కారుచీకట్లలో చిన్న దీపం వెలుగులో చిట్టడవులే నివాసలుగా చేసుకుని బొగ్గులు కాలుస్తూ జీవితాన్ని దుర్భరంగా గడుపుతున్నారు.

ప్రజాశక్తి-పెనుకొండ

మహారాష్ట్ర లోని మాన్గావ్ తాలుకా ఇందాపూర్ గ్రామానికి చెందిన 15 కుటుంబాలు పెనుకొండ సమీపంలో పెద్ద చెరువు కట్ట ఆంజనేయస్వామి దేవాలయం ఎదుగా 44వ జాతీయ రహదారి పక్కన సీమజాలి చెట్లను కాల్చి బొగ్గులు తయారు చేస్తున్నారు. వీరంతా అక్కడే పాత సిమెంటు సంచులతో చిన్న గుడిసెలు ఏర్పాటు చేసుకుని నివాసం ఉంటున్నారు. వీరు ఉన్న ప్రదేశం ముళ్ల చెట్లతో నిండిపోయి చిట్టడవుని తలపిస్తోంది. అక్కడే తినాలి.. అక్కడే పడుకోవాలి. చిన్న లాంతరు పెట్టుకుని రాత్రిళ్ల నిద్రిస్తున్నారు. విషపురుగులు, క్రూర జంతువులతో ప్రాణాలకు హాని ఉన్నా మరోదారి లేక అక్కడే బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. సొంత గ్రామంలో చేయడానికి పనులు లేక కుటుంబంలోని మొత్తం సభ్యులు ఇక్కడికి వలస వచ్చి బొగ్గులు కాల్చే పనులు చేస్తున్నారు. వీరంతా బొగ్గులు కాల్చి ముంబై హైదరాబాద్ బెంగళూర్ వంటి నగరాలకు సరఫరా చేసే నితిందేవ్కేట్ అనే వ్యాపారి వద్ద పనిచేస్తున్నారు. ఈ వ్యాపారి బొగ్గులు కాల్చే ఒక్కొక్కరికి ఏడాదికి రూ.1లక్ష చొప్పున ఇచ్చి పని చేయించుకుంటున్నట్లు తెలుస్తోంది. బొగ్గులు కాల్చే కార్మికులు జీవనానికి బియ్యం, కూరగాయలు, ఇతర సరుకులకు డబ్బులు ముందస్తుగా ఇస్తే కార్మికులకు ఇచ్చే రూ.లక్షలో పట్టుకుని ఇస్తారు. కార్మికులు కనీసం తాగడానికి నీళ్లు కూడా ఉండడం లేదు. నీరు కావాలంటే వారున్న ప్రాంతం నుంచి రెండు మూడు కిలోమీటర్లు నడిచి వెళ్లి తెచ్చుకోవాలి. స్నానాలు కాలకత్యాలు తీర్చుకునేందుకు నీటి కోసం హంద్రీనీవా కాలవ నుండి లీకైన నీరు కురుసవాండ్ల చెరువుకు వెళ్లే కాలువలో తెచ్చుకుంటున్నారు. అక్కడే తింటున్నారు.. అక్కడే నిద్రిస్తున్నారు. నిత్యం బొగ్గు బట్టీలకు సమీపంలో ఉండడంతో విష వాయువులు పీల్చి కార్మికులు, వారి పిల్లలు అనారోగ్యం పాలవుతున్నారు. చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు.



బొగ్గులు కాల్చే ప్రదేశంలో కార్మికుల పిల్లలు

చదువులకు పిల్లలు దూరం

ఆడుతూ పాడుతూ గడపాల్సిన బాల్యం బొగ్గుల బట్టీల్లో బుగ్గిపాలవుతోంది. తల్లిదండ్రులు వలస వస్తున్న సందర్భంలో పిల్లలను వారి వెంట తెచ్చుకుంటున్నారు. దీంతో పిల్లలు చదువుకు దూరం అవుతున్నారు. తల్లిదండ్రులు ఎక్కడికి వెళ్తే అక్కడికి వారి పిల్లల్ని తీసుకెళ్తున్నారు. విద్యాబుద్ధులు నేర్చుకోవాల్సిన వయసులో ఇలా వలస వెళ్లిన పిల్లల బంగారు భవిష్యత్తు నాశనం అవుతోంది.

పాత సిమెంట్ సంచులే నివాసాలు

బొగ్గులు కాల్చే ప్రాంతంలో కార్మికులకు వసతి ఏర్పాటు చేయడంపై వారిని తీసుకొచ్చిన వ్యాపారి దృష్టి సారించలేదు. కార్మికులు పాత సిమెంట్ సంచుల బట్టలను కుట్టుకుని చిన్న కర్రలను గుడిసెలా ఏర్పాటు చేసుకుని అందులో ఉంటున్నారు. ఎండా వాన గాలికి తట్టుకుని ఆ చిన్న గుడిసెలోనే తలదాచుకుంటున్నారు. మహిళలు స్నానం చేయాలన్న బహిర్భూమికి వెళ్లాలన్న తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్మికులు 15 రోజులకు ఒకసారి స్నానం చేయడంతో చర్మవ్యాధులు ప్రబలి అనారోగ్యం పాలవుతున్నారు.

ఉపాధి లేక వలసొచ్చాం



సొంత గ్రామంలో ఉపాధి అవకాశాలు లేక ఇలా బొగ్గు కాల్చేందుకు వచ్చాం. పిల్లలను అక్కడ వదిలిరావడానికి వారి వద్ద ఎవరూ ఉండరు. అందుకే మాతో పాటు పిల్లల్ని తీసుకుని వచ్చాం. ఏడాది పొడవునా బొగ్గుకాల్చే పనులు చేస్తే లక్ష రూపాయలు ఇస్తారు. అందులో మా జీవనానికి తీసుకున్న మొత్తాన్ని తొలగించి చివరన మిగిలింది వ్యాపారి మాకు ఇస్తారు. పనిచేసే ప్రాంతంలో పాములు విషపరుగులు ఉంటాయి. తాగడానికి నీటి వసతిఉండదు.

విలాస్, కార్మికుడు.

వలస కార్మికులకు భద్రత కల్పించాలి

మహారాష్ట్ర నుంచి వలస వచ్చి బొగ్గు కాలుస్తున్న వలస కార్మికులకు భద్రత కల్పించాలి. బొగ్గుల వ్యాపారి కార్మికుల కష్టాలను దోచుకుని లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. కార్మికులకు వసతి సౌకర్యాలను కల్పించడం లేదు. తాగడానికి నీరు కూడా లేక కార్మికులు అవస్థలు పడుతున్నారు. అటవీ శాఖ అధికారులు బొగ్గుబట్టి యజమానులకు అనుమతులు ఇచ్చే సమయంలో కార్మికులకు కల్పించాల్సిన భద్రతా ప్రమాణాలను పరిశీలించి ఇవ్వాలి. వలస వచ్చిన కార్మికుల పిల్లలకు స్థానిక పాఠశాలల్లో చదువులు చెప్పే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

హరి, సిపిఎం నాయకులు.

ఏకత్వాన్ని దెబ్బతీసేలా బిజెపి కుట్ర

- రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నాలు
- లౌకికవాదంతో సమాజం అభివృద్ధి
- హైకోర్టు రిటైర్డు జడ్జీ కె.చంద్రు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాజ్యాంగ స్ఫూర్తికి మూలమైన భిన్నత్వంలో ఏకత్వాన్ని దెబ్బతీసేందుకు బిజెపి దాని అనుబంధ సంస్థలైన ఆర్ఎస్‌లు కుట్ర చేస్తున్నాయని హైకోర్టు రిటైర్డ్ జడ్జి కె.చంద్రు పేర్కొన్నారు. అనంతపురం నగరంలోని ఆర్ట్స్ కళాశాల డ్రామా హాలులో 'ఇన్ డిఫెన్స్ ఆఫ్ ఇండియన్ కాన్స్టిట్యూషను' అన్న అంశంపై ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ), జన విజ్ఞాన వేదిక (జెవివి) సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నాడు సదస్సు జరిగింది. అనంతపురం బార్ అసోసియేషన్ అధ్యక్షులు గురుప్రసాద్ అధ్యక్షతన జరిగిన సదస్సులో జస్టిస్ చంద్రు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి, దాని అనుబంధ సంఘమైన ఆర్ఎస్ఎస్ రాజ్యాంగాన్ని మార్చేందుకు అడుగడుగునా కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. దేశ స్వాతంత్రం కోసం పోరాడిన మహాత్మాగాంధీ పేరును ఉపాధి హామీ పథకానికి పెట్టగా బిజెపి పాలనలో గాంధీ పేరు కన్పించకూడదన్న ఉద్దేశంతో ఆ పథకం పేరును పూజ్య బాపుజీగా మార్చడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందన్నారు. గాంధీ పేరును ప్రజల నుంచి దూరం చేయడంలో భాగంగానే పేరును మార్చారన్నారు. రాజ్యాంగ పరిరక్షణలో కీలకంగా వ్యవహరించాల్సిన న్యాయ వ్యవస్థ కూడా కొన్ని చోట్ల పాలకులకు అనుకూలంగా వ్యవహరిస్తుండటం శోచనీయమన్నారు. పాలస్తీనకు మద్దతుగా ముంబయి సిపిఎం ఒక సభను నిర్వహించాలని చూస్తే అక్కడి పోలీసు అధికారులు అనుమతినివ్వలేదని చెప్పారు. దీనిపై న్యాయస్థానానికెళితే ఇతర ప్రాంతాల్లో జరుగుతున్న పరిణామాలపై ఇక్కడ కార్యక్రమాలు నిర్వహించడానికి వీల్లేదని ఉత్తర్వులివ్వడం విస్మయం కలిగిస్తోందన్నారు. కర్నాటకలో హిజాబ్ విషయంలోనూ ఇదే స్పష్టంగా కనిపిస్తుందన్నారు. రాజ్యాంగ నిర్మాణ సమయంలోనే రాజ్యాంగ పరిషత్‌లో అత్యధికులు హిందువులే ఉన్నప్పటికీ భారత దేశం లౌకికంగా ఉండాలని నిర్ణయించారని గుర్తుచేశారు. అందుకు అనుగుణంగానే రాజ్యాంగ నిర్మాణం జరిగిందన్నారు. మరోవైపు ప్రశ్నించే గొంతుకలను అణచివేయాలని పాలకులు చూస్తున్నారన్నారు. జెఎన్‌యు విద్యార్థి ఉమర్ ఖాలీద్‌ను ఐదేళ్లుగా జైళ్లో పెట్టడమే ఇందుకు నిదర్శనం అన్నారు. అతనిపై నమోదు చేసిన కేసులో ఇప్పటి వరకు ఎటువంటి అభియోగాలనూ పోలీసులు రుజువు చేయలేకపోయారన్నారు. రాబోయే రోజుల్లో దేశంలో ప్రజాస్వామ్యం మనుగడ సాగించాలంటే భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం, బాధ్యత అందరిపైనా ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, ఐలూ జాతీయ కార్యదర్శి నర్ర శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటస్వామి, నాయకులు నరసింహ, మానవ హక్కుల వేదిక నాయకులు చంద్రశేఖర్, ప్రముఖ వైద్యులు వంశీకృష్ణ , జెవివి జిల్లా కార్యదర్శి వీరరాజు, ఐలూ నాయకులు పాల్గొన్నారు.

తొలగిస్తే.. ఉద్యమిస్తాం..!

- పారిశుధ్య కార్మికుల పొట్టకొట్టొద్దు
- ఆందోళన చేస్తున్న కార్మికుల అరెస్టు
- సిపిఎం, సిఐటియు ప్రజా సంఘాల ఖండన



ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

'కరోనా కష్టకాలంలో ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించాం. చాలీచాలని వేతనం ఇస్తున్నా కుటుంబ పోషణ కోసం విధులు నిర్వహిస్తున్నాం. ఈ ఉద్యోగాన్నే నమ్ముకుని ఏళ్ల తరబడి పని చేస్తున్నాం. ఉన్న ఫలంగా తొలగించి వీధిన పడేస్తామంటే ఊరుకోం. ఉద్యోగం నుంచి తొలగిస్తామంటే ఉద్యమిస్తాం.' అంటూ ప్రభుతాసుపత్రి పారిశుధ్య కార్మికులు స్పష్టం చేశారు. సర్వజనాసుపత్రి, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రుల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు, సూపర్‌వైజర్‌లు ఆదివారం నాడు సర్వజనాసుపత్రిలో శాంతియుతంగా నిరసన చేపట్టారు. ఉదయం కార్మికులు ఆసుపత్రికి రాగానే పోలీసులు పెద్ద ఎత్తున మోహరించి వారిని అడ్డుకున్నారు. నిరసన తెలిపేందుకు వీల్లేదంటూ బలవంతంగా అరెస్టు చేసి పలు పోలీసు స్టేషన్లకు తరలించారు. కార్మికుల అరెస్టులను సిపిఎం, సిఐటియు, ఇతర కార్మిక, ప్రజా సంఘాలు ఖండించాయి. బుక్కరాయసముద్రం పోలీస్‌స్టేషన్‌లో ఉన్న కార్మికులను సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, నగర కార్యదర్శి వి.రామిరెడ్డి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, నగర కార్యదర్శి ముత్తుజాలు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 42 రోజులుగా ప్రభుత్వ ఆసుపత్రి, సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రుల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు, సూపర్ వైజర్లు శాంతియుతంగా ప్రభుత్వ ఆసుపత్రి ముందు ధర్నా చేస్తున్నారని చెప్పారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్నా పోలీసులు అక్రమంగా అరెస్టులు చేయడం దుర్మార్గం అన్నారు. ప్రభుత్వం కార్మికుల పక్షాన కాకుండా కాంట్రాక్టర్లకు వత్తాసు పలికేలా వ్యవహరించడం సరికాదన్నారు. 50 సంవత్సరాలు నిండిన వారందరినీ ఇళ్లకు పంపిస్తే ఇన్నేళ్లు ఈ పనులు చేసిన వీరు ఎలా బతుకుతారని నిలదీశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు అరెస్టులతో కాకుండా కార్మికులకు న్యాయం చేసేలా సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు గోపాల్, ఎస్సీ, ఎస్టీ జెఎసి కన్వీనర్ సాకే హరి, సిఐటియు నాయకులు ఆజాం, జిలాన్, సిపిఎం బుక్కరాయసముద్రం మండల కార్యదర్శి కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం : ఆర్డీవో

సర్వజనాసుపత్రి, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రుల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు, సూపర్‌వైజర్‌లు సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అనంతపురం ఆర్‌డిఒ కేశవనాయుడు హామి ఇచ్చారు. కార్మికుల సమస్యలపై ఆర్‌డిఒ కార్మిక సంఘాలు, ఆసుపత్రి అధికారులు, పద్మావతి ఏజెన్సీ ప్రతినిధులతో తన కార్యాలయంలో ఆదివారం నాడు సమావేశం నిర్వహించారు. చర్చల్లో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్, నగర కార్యదర్శి ముత్తుజా, నగర ఉపాధ్యక్షులు వి.రామిరెడ్డి, గోపాల్, ఎటిఎం.నాగరాజు, నల్లమ్మ, సాకే హరి, సురేష్ తదితరులు పాల్గొన్నారు. 2వ పట్టణ పోలీస్ స్టేషన్ సిఐ శ్రీకాంత్, పద్మావతి ఏజెన్సీ ప్రతినిధులు సాయి, హరి, ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ కూడా ఇందులో పాల్గొన్నారు. కొత్తగా కాంట్రాక్టు దక్కించుకున్న భాస్కర్ నాయుడు బలవంతంగా కార్మికులను ఇంటికి పంపిస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని కార్మిక సంఘం నాయకులు తెలిపారు. దీనిపై ఆర్డీవో స్పందిస్తూ త్వరలో కాంట్రాక్టర్‌ను పిలిపించి ఈ సమస్యను పరిష్కరిస్తామని, అంత దాకా శాంతియుతంగా మీరు ఆందోళన చేసుకోవచ్చని తెలిపారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడే దాకా కొత్తవారిని పనిలోకి తీసుకోవద్దని ప్రతినిధులకు చెప్పారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

సత్యసాయి జిల్లా వైద్యాధికారి ఫిరోజ్ బేగం



ఫిరోజ్ బేగం



ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

'కాలానుగుణంగా వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ప్రస్తుత శీతాకాలంలో వృద్ధులు, పిల్లలు జాగ్రత్తలు తీసుకోవాలని శ్రీ సత్యసాయి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఫిరోజ్ బేగం తెలియజేశారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ప్రజలు తీసుకోవాల్సిన పలు విషయాలను ప్రజాశక్తితో ఆమె ముచ్చటించారు.

ప్ర: సత్యసాయి జయంతోత్సవాల్లో వైద్య ఆరోగ్యశాఖ పరంగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు.? ఎన్ని మెడికల్ క్యాంపులు నిర్వహించారు.?

డిఎంహెచ్ఓ : సత్య సాయి జయంతోత్సవాలలో పుట్టపర్తిలో 23 మెడికల్ క్యాంపులు నిర్వహించాం. పది రోజులు పాటు వీటిని కొనసాగించాం. భక్తులు బస, పార్కింగ్ చేసిన ప్రదేశాల్లో కలిపి పట్టణం, ప్రశాంతి నిలయంలో 12 చోట్ల మెడికల్ క్యాంపులు, ఏర్పాటుచేసి వేలాదిమందికి వైద్య సేవలు అందించాం. అంతేకాక వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండ్యన్ ఆదేశాల మేరకు హిల్‌వ్యూ స్టేడియంలో ప్రధానమంత్రి బహిరంగ సమావేశ సందర్భంగా స్టేడియంలో 10 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశాం. ప్రధానమంత్రి, రాష్ట్రపతి, గవర్నర్, ఉపరాష్ట్రపతి, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి వెంట ప్రోటోకాల్ ప్రకారం అంబులెన్స్‌లు ఏర్పాటు చేశాం. భక్తుల సౌకర్యం ఎక్కడ ఇలాంటి అసౌకర్యం కలగకుండా పట్టణంలో సత్యమ్మ గుడి, చిత్రావతి రోడ్డు, యనమలపల్లి, గణేష్ కూడలి, ఆర్డీవో కార్యాలయం ఆర్టీసీ బస్టాండ్, ప్రశాంతి నిలయం తదితర ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశాం.

ప్ర: సీజనల్ వ్యాధుల నియంత్రణపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

డిఎంహెచ్ఓ: సత్యసాయి జిల్లా వ్యాప్తంగా సీజనల్ వ్యాధులు అదుపులోనే ఉన్నాయి. ఇటీవల జిల్లా వ్యాప్తంగా స్క్రబ్ టైఫస్‌కు సంబంధించి 199 మందిని అనుమానితులుగా గుర్తించాం. రక్తపరీక్షలు చేయగా ఇందులో 9మందికి పాజిటివ్ వచ్చింది. వీరిలో ఆరుగురు ఇప్పటికే పూర్తిగా కోలుకున్నారు. ముగ్గురు మాత్రమే ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. స్క్రబ్ టైఫస్ వల్ల ఎలాంటి ప్రాణహానీ లేదు. ప్రాథమిక ఆరోగ్యశాఖ సిబ్బంది పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సర్వేలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మలేరియా, డెంగీ, పిల్లలకు మధుమేహం, వ్యాధులు అదుపులోనే ఉన్నాయి. 104 సిబ్బంది ద్వారా గ్రామాల్లో బీపీ, షుగర్, క్యాన్సర్ వంటి పరీక్షలను చేయిస్తున్నాం. చలి తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పిల్లలు, వృద్ధులు జాగ్రత్తలు తీసుకోవాలి.

ప్ర: జిల్లాలో లెప్రసీ కేసులు ఎన్ని ఉన్నాయి.?

డిఎంహెచ్ఓ : జిల్లాలో లెప్రసీ కేసులు గుర్తించడానికి జనవరి 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు సర్వే నిర్వహించాం. స్పర్శ లేని మచ్చలు కలిగిన వ్యక్తులను గుర్తించి వ్యాధి నిర్ధారణ అయితే వారికి ప్రభుత్వం నుండి ఉచితంగా మందులను అందజేస్తున్నాం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సర్వేలు నిర్వహించి జిల్లావ్యాప్తంగా 3621 కేసులు గుర్తించగా, వాటిలో 1341 కేసులను పరీక్షించాం. అందులో ఐదు కేసులు మాత్రం నిర్ధారణయ్యాయి. గతంలో గుర్తించిన కేసులను సైతం పరిశీలించి పరీక్షించారు.

ప్ర: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లు అందుబాటులో లేరనే ఆరోపణలపై మీ అభిప్రాయం ఏమిటి.?

డిఎంహెచ్ఓ : జిల్లా వ్యాప్తంగా ఏరియా ఆసుపత్రుల్లో 24 గంటలు డాక్టర్ అందుబాటులో ఉంటారు. వారు షిఫ్టుల ప్రకారం వచ్చి వెళుతూ ఉంటారు. అర్బన్ హెల్త్ సెంటర్లు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో డాక్టర్లు అందుబాటులో ఉంటున్నారు. డాక్టర్లు అందుబాటులో లేరనే మాట అవాస్తవం. జిల్లా అధికారులు తరచూ ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంపెయిన్ల ద్వారా విజిట్లు నిర్వహిస్తున్నాం. విధులకు హాజరు కాని వారిని తమ దృష్టికి వస్తే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

ప్ర: జిల్లా వ్యాప్తంగా సిబ్బంది, మందుల కొరత ఉందా.?

డిఎంహెచ్ఓ : శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం ఎలాంటి మందుల కొరతా లేదు. జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 47 ఉండగా వాటిలో 26 మంది స్టాఫ్ నర్సులు, కొరత ఉంది. రామగిరిలో డాక్టర్ లేరు. వాటిని భర్తీ చేయడానికి అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం.

ప్ర: జిల్లా వ్యాప్తంగా జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు మంజూరులో అక్రమాలు జరుగుతున్నా మాట వాస్తవమేనా.?

డిఎంహెచ్ఓ : జిల్లాలోని అమరాపురం మండలం కొమిరేపల్లి గ్రామంలో 10 నెలల్లోనే 4వేలకుపైగా జనన ధ్రువీకరణ పత్రాలు మంజూరుపై సమగ్ర విచారణ చేపట్టాం. నిబంధనలకు విరుద్ధంగా సర్టిఫికెట్లు ఇచ్చిన వారిపై పోలీస్ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా 12 వేలు నమోదు అయితే కొమిరేపల్లిలో మాత్రం 3982 ఒక గ్రామ పంచాయతీలోనే అత్యధికంగా నమోదు కావడంపై విచారణ జరపాలని ఆదేశాలు జారీ చేశాం.

గ్రామాల్లో బెల్టుషాపుల జోరు యథేచ్ఛగా అమ్మకాలు

ప్రజాశక్తి-యల్లనూరు

మండల కేంద్రంలోని ఓ మద్యం షాపు నుంచి అక్రమ మద్యాన్ని వివిధ గ్రామాలకు తరలిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఈ షాపులో అమ్మకాలు జరుగుతున్నా పోలీసులు, సంబంధిత అధికారులు మౌనంగా ఉండడపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మండల కేంద్రంలోని మద్యం షాపుకు అనుబంధంగా మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. ప్రతి గ్రామంలో మూడు నుండి నాలుగు బెల్టు షాపులు నిర్వహిస్తున్నా అధికారులు స్పందించకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. పోలీసులు, సంబంధిత అధికారులు స్పందించి గ్రామాల్లో బెల్టు షాపులను అరికట్టాలని గ్రామీణులు కోరుతున్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనూ ఫిజియోథెరపీ కోర్సులు

- ఎన్టీఆర్ ఆరోగ్య వర్సిటీ విసి డాక్టర్ చంద్రశేఖర్
- ఘనంగా కస్తూరి ఫిజియోథెరపీ కళాశాల 20వ స్నాతకోత్సవం



స్నాతకోత్సవంలో పాల్గొన్న విసి చంద్రశేఖర్

ప్రజాశక్తి-అనంతపురం

ఈ ఏడాది నుంచి ప్రభుత్వ ఫిజియోథెరపీ కళాశాలల్లోనూ ఫిజియోథెరపీ కోర్సులు ప్రారంభించ నున్నట్లు డా. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డా. చంద్రశేఖర్ తెలిపారు. నగరంలోని కస్తూరి కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ కళాశాలలో ఆదివారం 20వ స్నాతకోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విసి చంద్రశేఖర్ ఫిజియోథెరపీ విద్యార్థులను ఉద్దేశించి ప్రసం గించారు. ఫిజియోథెరపీతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. రోగం నయం చేయడంలో ఫిజియో థెరపీల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఫిజియోథెరపీ వల్ల కొన్ని జబ్బుల్లో వ్యాధిగ్రస్తులకు అత్యంత వేగవంతంగా ఉపశమనం కలిగి ఆరోగ్యవంతులవుతారని తెలిపారు. అనంతరం ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అలాగే బిపిటిలో యూనివర్సిటీలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థిని వరలక్ష్మితో పాటు ఆమె తల్లిదండ్రులను ప్రత్యేకంగా ప్రశంసా పత్రం మెడల్స్‌తో అభినందించారు. గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ పరేడ్ నిర్వహించిన వాలంటీర్లు, వివిధ పోటీల విజేత విద్యార్థులను ప్రశంసా పత్రం, మెడల్స్‌తో సత్కరించారు. విద్యార్థులు ప్రదర్శిం చిన సాంస్కృతిక కార్యక్రమాలు హోరెత్తించాయి. కార్యక్రమంలో ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బెనెడిక్ట, న్యూరో సర్జరీ ప్రధాన విభాగాధిపతి డా.భాస్కర్, కస్తూరి ఫిజియోథెరఫీ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ ప్రహ్లాద, సెక్రటరీ డా. సుదర్శన్, కరస్పాండెంట్ చంద్రశేఖర్, వైద్య కళాశాల అధ్యాపకులు డాక్టర్ చైతన్య, డాక్టర్ ఆదిరెడ్డి పరదేశినాయుడు, విఠల్‌శెట్టి, అధ్యాపకులు, శ్రీశ్రీనివాస నర్సింగ్ కళాశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కాంచీపురం పిఎస్ఆర్ మాల్ ప్రారంభం



షోరూంను ప్రారంభిస్తున్న సోమిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం నగరం పాత డీఈవో ఆఫీస్ వద్ద శ్రీ కాంచీపురం పిఎస్ఆర్ షాపింగ్ మాల్‌ను ముక్తాపురం సరస్వతి సోమిరెడ్డి ఆదివారం ప్రాభించారు. ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణంగా సరికొత్త డిజైన్‌లతో కూడుకున్న అతి పెద్ద వస్త్రాలయం శ్రీ కాంచీపురం పిఎస్ఆర్ షాపింగ్ మాల్‌ను మహిళలకు, పిల్లల కోసం అందుబాటులోకి తెచ్చినట్లు ఎస్ఆర్ షాపింగ్ మాల్ అధినేత ముక్తాపురం సరస్వతి సోమిరెడ్డి పేర్కొన్నారు. తమ షోరూంలో చిన్న పిల్లలు నుంచి పెద్దల వరకు అన్ని రకాల నాణ్యమైన వస్త్రాలు ప్రజలకు ఒకే చోట అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. జిల్లా ప్రజలు నూతన కాంచీపురం పిఎస్ఆర్ షాపింగ్ మాల్‌ను సందర్శించాలని కోరారు.

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

అనంతపురం కలెక్టరేట్ : కలెక్టరేట్ రెవెన్యూభవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరించనున్నట్లు

పుట్లూరులో ఇన్‌ఛార్జి అధికారుల పాలన..!

పూర్తిస్థాయిలో అందని సేవలు.. ఇబ్బందుల్లో మండల ప్రజలు

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలో పలు శాఖల్లో రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో ఇన్‌ఛార్జ్ అధికారులను నియమించారు. దీంతో ప్రజలకు సేవలందడంలో జాప్యం జరుగుతోంది. దీనికి తోడు పూర్తి స్థాయిలో సేవలందడం లేదు. ప్రధానంగా కీలకమైన రెవెన్యూ శాఖలో రెగ్యులర్ తహశీల్దార్ లేకపోవడంతో శింగనమల మండలం తహశీల్దార్ శేషారెడ్డికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన 15 రోజులకు ఓ సారి లేదా నెలలో రెండు లేదా మూడు మార్లు వచ్చిపోతున్నారు. దీంతో రైతులతో పాటు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే రెగ్యులర్ ఎస్ఐ లేకపోవడంతో యల్లనూరు ఎస్ఐ రామాంజనేయ రెడ్డికి ఇన్‌ఛార్జ్‌గా నియమించారు. ఆయన వీలున్న సమయంలో వచ్చి పోతున్నారు. దీంతో మండలంలో ఓ రకంగా శాంతి భద్రతల సమస్యలు నెలకొన్నాయని చెప్పవచ్చు. ప్రధానంగా ఇటీవల కాలంలో చోరీల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. ఇక పశు వైద్యశాలలో ఆరేళ్లుగా రెగ్యులర్ వైద్యుడే లేరు. దీంతో పుట్లూరు మండలానికి చెందిన వెటర్నరీ డాక్టర్‌ను ఇన్‌ఛార్జిగా నియమించారు. ట్రాన్స్‌కో ఏఈ కూడా లేకపోవడంతో ఎడిసి ఇన్‌ఛార్జిగా ఉన్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఆయా శాఖలకు రెగ్యులర్ అధికారులను నియమించి సకాలంలో పూర్తి స్థాయిలో సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



పుట్లూరు తహశీల్దార్ కార్యాలయం

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలోని అబిద్ స్కాన్ సెంటర్ నిర్వాహకులు, ప్రథమ మున్సిపల్ చైర్మన్ దావూద్ సాహెబ్ జ్ఞాపకార్థంగా ఆదివారం స్థానిక శ్రీకరణానందగిరి స్వామి జూనియర్ కళాశాలలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏపిజె అబ్దుల్ కలాం క్విజ్ పోటీ పరీక్షలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జూనియర్ కళాశాల లెక్చరర్ పద్మనాభం, లక్ష్మీనారాయణ, నిర్వాహకుడు అబిద్ స్కాన్ సెంటర్ డాక్టర్ అర్షద్, డాక్టర్ సంజీవ, ఆడిట్నేట్ రమేష్, డివైఎఫ్ఐ కార్యదర్శి సురేంద్రబాబు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం విద్యాసంస్థల్లో కేవలం అకడమిక్ పుస్తకాల్లోని పాఠ్యాంశాలను బోధిస్తున్నారని, తద్వారా విద్యార్థులకు పోటీ పరీక్షలపై అవగాహన లేకుండా పోతుందన్నారు. విద్యార్థులు సమాజం పట్ల అవగాహన పెంచుకోవాలనే ఉద్దేశంతో ఈ పోటీలు నిర్వహించామన్నారు. పోటీలు నిర్వహణకు ముందుకొచ్చిన డాక్టర్ అర్షద్‌ను అభినందించారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ. 10వేలు, రూ. 5వేలు, రూ. 3వేలు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపిజె అబ్దుల్ కలాం సొసైటీ నిర్వాహకులు నిజాం, ఖాదర్ నిజాం, మన్సూర్, జీషాన్, రఫీ, సుభాష్, సుమలత, జమీరా, రాము, తదితరులు పాల్గొన్నారు.


క్విజ్ పోటీల పత్రాలను చూపుతున్న డివైఎఫ్ఐ నాయకులు

ఉరవకొండలో సిఎస్ఐ చర్చి ప్రారంభం

ప్రజాశక్తి-వజ్రకరూరు

ఉరవకొండ పట్టణంలో నూతనంగా నిర్మించిన సిఎస్ఐ చర్చి ప్రారంభోత్స కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన ఆదివారం పాస్టర్లు, చర్చి సభ్యులతో కలిసి రిబ్బన్ కట్ చేసి చర్చిని ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ జీసస్ సూచించిన ప్రేమ సందేశం క్రిస్టియన్ మానవాళికి స్ఫూర్తిదాయకమన్నారు. తద్వారా మరింత మెరుగైన సమాజాన్ని నిర్మించేందుకు ఉపయోగపడుతుందన్నారు. తనకు మేడలు, కోట్లు సంపాదించాలనే ఆశ లేదని, మీ అందరి ప్రేమాభిమానాలు సంపాదిస్తే అదే జీవితంలో పెద్ద ఆస్తి అని భావిస్తానన్నారు. ఏ మతమైనా సమాజంలో ఎలా బతకాలనేది చెబుతుందని, పది మందితో ఎట్లా ఉండాలి అనేది నేర్పుతుందన్నారు. అనంతరం చర్చి సభ్యులు మంత్రిని పూలమాలలు, శాలవాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాస్టర్ ప్రమీల జోసెఫ్, సంఘ పెద్దలు భాస్కర్‌బాబు, షాహిన్, డేవిడ్, సాకే.భాస్కర్, జగదీష్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.


ఉరవకొండలో సిఎస్ఐ చర్చిని ప్రారంభిస్తున్న మంత్రి కేశవ్

'స్వచ్ఛభారత్-ప్లాస్టిక్ నిర్మూలన'పై అవగాహన


ప్రజాశక్తి-శింగనమల

బుక్కరాయసముద్రం మండలం రోటరీ పురం గ్రామంలోని ఎస్ఆర్ఐటి కళాశాల విద్యార్థులు ఆదివారం గ్రామాల్లో ప్రజలకు 'స్వచ్ఛ భారత్-ప్లాస్టిక్ నిర్మూలన'పై అవగాహన కల్పించారు. శింగనమల మండలంలోని చిన్నమట్లగొంది గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం లత పాల్గొన్నారు. అలాగే పెద్దమట్లగొంది గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి సర్పంచి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. హెచ్ఎం లత మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వై.మధుసూదన్, టి.అరవింద్‌బాబు, డాక్టర్ లక్ష్మీనారాయణ, వాలంటీర్లు పాల్గొన్నారు.

తగ్గుపర్తిలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-బెళుగుప్ప

మండలంలోని తగ్గుపర్తి గ్రామంలో ఆదివారం అనంతపురం నగరంలోని మ్యాగ్నస్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో సర్పంచి కోనంకి మౌనిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో కార్డియాలజీ నిపుణులు డాక్టర్ రిషిప్రసాద్, వారి వైద్య బృందం డాక్టర్ రితిన్‌చౌదరి, ఫిజీషియన్ లిఖిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో నాయకులు దబ్బర వెంకటనాయుడు, రాధాకృష్ణ, జయప్ప, తదితరులు పాల్గొన్నారు.


ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

యాడికిలో కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-యాడికి

అమీనా కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నంద్యాల శాంతిరామ్ కంటి ఆసుపత్రి సహకారంతో ఆదివారం స్థానిక పాత పోలీస్ స్టేషన్ వద్ద అమీనా ఆప్టికల్స్‌లో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో 80 మందికి కంటి వైద్య నిపుణులు తిప్పేస్వామి పరీక్షలు చేసి 18 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. ఆపరేషన్‌కు తీసుకెళ్లే వారికి ఉచిత బస్సు, భోజనం, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అమీనా కంటి ఆసుపత్రి యజమాని సయ్యద్, తదితరులు పాల్గొన్నారు.


భైరవానితిప్ప ప్రాజెక్ట్

21 నుంచి బిటిపి సాగునీరు విడుదల

ప్రజాశక్తి-గుమ్మఘట్ట

మండలంలోని భైరవానితిప్ప ప్రాజెక్ట్(బిటిపి) కింద ఆయకట్టుకు సాగునీటి విడుదల తేదీని వాయిదా వేసినట్లు డీఈ గీతాలక్ష్మి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుంచి బిటిపి నుంచి ఆయకట్టుకు నీరు విడుదల చేయాల్సి ఉంది. అయితే నేటికీ కాలువల్లో పూడికతీత పనులు జరుగుతున్నందున నీటి సంఘాల అధ్యక్షుల అభ్యర్థన మేరకు నీటి విడుదల తేదీని ఈ నెల 21కి వాయిదా వేసినట్లు తెలిపారు. రైతులు ఈ విషయం దృష్టిలో ఉంచుకుని, సహకరించాలని ఆమె కోరారు.

నేడు డయల్ యువర్ ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి

ప్రజాశక్తి-అనంతపురం

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 15వ తేదీ ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు 89777 16661కు కాల్ చేసి విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకెళ్లవచ్చు.

రబీలో వేరుశనగ సాగుపై రైతుల ఆసక్తి

కంది, మొక్కజొన్న సాగులో నష్టాలే కారణం.. రాయితీ విత్తనం లేకున్నా ప్రయివేట్ వ్యాపారులతో కొనుగోలు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

దశాబ్దాల కాలంగా ఖరీఫ్, రబీ సీజన్లలో వేరుశనగ సాగు చేస్తూ వివిధ రకాలుగా నష్టాలు చవిచూసిన రైతులు ఇటీవల కాలంలో పంటల మార్పిడిపై ఆలోచనలో పడ్డారు. ఇందులో భాగంగానే ఖరీఫ్‌లో వర్షాధారంపై కంది, ఆముదం సాగు చేయడానికి మొగ్గుచూపారు. ప్రత్యేకించి రెండేళ్లుగా ఖరీఫ్‌లో కంది సాగు విస్తీర్ణం అనుహ్యంగా పెరిగింది. వేరుశనగ సాగు కంటే రెండింతలెక్కువ విస్తీర్ణంలో కంది సాగు చేశారు. కళ్యాణదుర్గం వ్యవసాయ డివిజన్‌లో ఈసారి కందిసాగు చేసిన రైతులకు అంతగా దిగుబడులు రాలేదు. వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులు, ఇతర కారణాల వల్ల ఎకరాకు 3 క్వింటాళ్ల దిగుబడికే పరిమితమైంది. అయితే కందిలో కూడా లాభాలు లేవని భావించిన రైతులు రబీలో బోరుబావుల కింద వేరుశనగ సాగు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే పలువురు వేరుశనగ సాగుచేయగా మరికొందరు రైతులు ఆ పనుల్లో నిమగ్నమయ్యారు. వ్యవసాయాశాఖ అంచనా ప్రకారం రబీలో ఈసారి వేరుశనగ సాగు విస్తీర్ణం పెరగనుంది.

'కె-6' పైనే ఆసక్తి

కళ్యాణదుర్గం వ్యవసాయ డివిజన్‌లో చాలా మంది రైతులు కె-6 రకం వేరుశనగ సాగుకు మొగ్గు చూపుతున్నారు. గతంలో ఖరీఫ్, రబీ సీజన్లలో ఇదే రకం సాగు చేసేవారు. ఇప్పటికే సుమారు 3వేల హెక్టార్లలో (50 శాతానికి పైగా) విత్తనం వేసినట్లు ప్రాథమిక అంచనా. మరో 15 రోజుల్లో ఇంకో 2,500కు పైగానే హెక్టార్లలో సాగయ్యే అవకాశాలు ఉన్నాయి.

ఎకరాకు రూ. 18వేలకు పైగానే పెట్టుబడి

బోరుబావుల కింద వేరుశనగ సాగు చేసే రైతులు రెండుసాళ్లలో విత్తనం వేస్తారు. ఇందుకు ఎకరాకు 80 కిలోల విత్తనం అవసరం అవుతుంది. ప్రస్తుతం క్వింటా వేరుశనగ ధర రూ. 13వేలకు పైగా ఉంది. ఈ లెక్కన 80 కిలోల విత్తనానికి రూ. 10వేలు, ఎరువులకు రూ. 6వేలు, సేద్యాలకు రూ. 2వేలు ప్రకారం ఎకరాకు రూ. 18వేలు పెట్టుబడి అవుతుంది.


ఒంటిమిద్ది గ్రామం వద్ద సాగు చేసిన వేరుశెనగ పంట

రైతు సంప్రదిస్తే రాయితీ విత్తనం పంపిణీ

రబీలో రాయితీపై వేరుశనగ విత్తనం కావాల్సిన రైతులు సంప్రదిస్తే సరఫరా చేస్తామని వ్యవసాయ శాఖ చెబుతోంది. గతేడాది రాయితీ విత్తన వేరుశనగ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా రాయితీ విత్తన వేరుశనగ కావాలని కేటాయింపులు చేపట్టలేదు. ఆసక్తి గల రైతులు ముందుకొచ్చి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటే రాయితీ పోనూ క్వింటా రూ. 5,520 ప్రకారం, ఒక్కో రైతుకు 90 కిలోలు ఇస్తారు.

కళ్యాణదుర్గం వ్యవసాయ డివిజన్‌లో రబీలో వేరుశనగ సాగు అంచనా.. మండలాల వారీగా హెక్టార్లలో.. కళ్యాణదుర్గం-1,482, కంబదూరు-1,003, కుందుర్పి- 874, శెట్టూరు-1,071, బ్రహ్మసముద్రం- 751, బెళుగుప్ప-369. మొత్తం-5,550 హెక్టార్లు.

సాగులో మెలకువలు పాటించాలి



వేరుశనగ సాగులో రైతులు మెలకువలు పాటించాలి. అధిక దిగుబడినిచ్చే కె-6 రకం, టిసిజిఎస్-1694, ఐసిజివి-9114 రకాలు విత్తుకోవాలి. డిసెంబర్ 31వ తేదీ లోపు విత్తుకుంటే దిగు బడులు వస్తాయి. ఎకరాకు యూరియా 10 కిలోలు, ఎస్ఎస్‌పి మందులు 100 కిలోలు, పొటాష్ 20 కిలోలు చల్లుకోవాలి. 45 రోజులు దాటాక జిప్సం వేసుకోవాలి. విత్తనం విత్తాక మూడు రోజుల్లోపు కలప మొక్కల నివారణకు మందులు పిచికారి చేసుకోవాలి.

- యల్లప్ప, ఎడిఎ

మూడెకరాల్లో సాగు చేస్తున్నా..



తోటలో మూడెకరాల్లో కె-6 రకం వేరుశనగ సాగు చేస్తున్నా. ఎకరాకు 80 కిలోల విత్తనాలు వేస్తున్నా. ఎరువులు, సేద్యాలకు ఖర్చు పెరిగింది. మూడెకరాల విత్తన సాగుకు రూ. 30వేలు ఖర్చు అవుతుంది. మంచి దిగుబడి వస్తుందని ఆశిస్తున్నా.

రామాంజినేయులు, రైతు బోరంపల్లి.

ఉద్యోగుల ఐక్యతకు క్రీడలు దోహదం చేస్తాయి

గుంతకల్లు రైల్వే డిఎస్‌టిఈ గోపికృష్ణయాదవ్

ప్రజాశక్తి-అనంతపురం

ఉద్యోగుల ఐక్యతకు క్రీడా పోటీలు ఎంతగానో దోహదం చేస్తాయని గుంతకల్లు రైల్వే డిఎస్టి ఈ గోపికృష్ణయాదవ్ తెలిపారు. నగరంలోని అనంత క్రీడా మైదానంలో ఆదివారం జిల్లా వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఉద్యోగుల క్రికెట్ టోర్నమెంట్ ముగింపు సభ, బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. క్రికెట్ పోటీలు ఎపి వెటరన్స్ క్రికెట్ అసోసి యేషన్, ఎపి స్పోర్ట్స్ డెవలప్మెంట్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించారు. ఎపి వెటరన్స్ క్రికెట్ అసోసి యేషన్ రాష్ట్ర అధ్యక్షులు మచ్చా రామలింగారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గుంతకల్లు రైల్వే డిఎస్‌టిఈ గోపికృష్ణయాదవ్, ఎడిఎస్‌టిఈ బి.వెంకటేశ్వర్లు, జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి యుగంధర్‌రెడ్డి హాజరయ్యారు. టోర్నీలో జిల్లా వ్యాప్తంగా 20 జట్లు పాల్గొనగా గుంతకల్లు రైల్వేస్ ఇంజినీరింగ్ జట్టు విన్నర్స్, అనంతపురం పోలీస్ జట్టు రన్నర్స్‌గా నిలిచాయి. ఆయా జట్లకు ముఖ్య అతిథులు బహుమ తులు అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా రమేష్, బెస్ట్ బౌలర్‌గా అశోక్, బెస్ట్ బ్యాటర్‌గా నాగరాజు నిలిచారు. కార్యక్రమంలో సిసిఎస్ సిఐ జైపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ముఖ్యఅతిథులు



మాజీ సైనికులను సన్మానించిన కెప్టెన్ దూదేకుల శేకన్న, వికె.రంగారెడ్డి

యుద్ధ వీరులకు సన్మానం

ప్రజాశక్తి-అనంతపురం

1965, 1971 యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులకు ఆదివారం నగరంలోని హెచ్ఎల్‌సి కాలనీలో ఉన్న మాజీ సైనికుల సంఘం కార్యాలయంలో సన్మాన సభ ఏర్పాటు చేశారు. ముందుగా మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షులు కెప్టెన్ దూదేకుల శేకన్న ఆధ్వర్యంలో వికె.రంగారెడ్డి యుద్ధవీరులను సన్మానించారు. వారు మాట్లాడుత 1971లో 'ఆపరేషన్ విజయ్' పేరుతో డిసెంబర్ 3 నుంచి 16 వరకూ యుద్ధం జరిగిందని, అప్పుడు పాకిస్తాన్‌ను ఓడించగా బాంగ్లాదేశ్ ఏర్పాటైందన్నారు. 93 వేల మంది పాకిస్తానీ సైనికులను బందీలుగా పట్టుకున్నామన్నారు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద యుద్ధం అన్నారు. ఆ యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులు వారి అనుభవాలను పంచుకున్నారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకొన్నారు. 1965లో జరిగిన యుద్ధంలో పాల్గొన్న సూపర్ సీనియర్ మాజీ సైనికులు పి.సిద్ధన్న, పి.గోవిందరెడ్డి, డి.రామచంద్రారెడ్డి, జి.నాగభూషణం, బాబారత్నం, వసంతులు, ఎం.నంజేగౌడ, సి.కల్లప్ప, 1971 యుద్ధంలో పాల్గొన్న వారిలో కెప్టెన్ శేకన్న, అబ్దుల్ ఖాదర్, ఖాజాసాహెబ్ తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో సంఘం ట్రెజరర్ తిమ్మారెడ్డి, ఈశ్వరయ్య, పెంచలయ్య, ఈ.రంగారెడ్డి, బిఎ.హుస్సేన్, జంగం శెట్టి సురేష్, తదితరులు పాల్గొన్నారు.


గుత్తి కోటను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆనంద్

గుత్తి కోటను సందర్శించిన కలెక్టర్

ప్రజాశక్తి-గుత్తి

చారిత్రాత్మకమైన గుత్తి కోటను ఆదివారం కలెక్టర్ ఓ.ఆనంద్ కుటుంబ సమేతంగా సందర్శిం చారు. ముందుగా ఆయన జిల్లా మొట్ట మొదటి కలెక్టర్ సర్ థామస్ మన్రో సమాధిని సందర్శించి నివాళులు అర్పించారు. ఆ తర్వాత గుత్తి కోటలోని గుర్రం, ఏనుగు శాలలు, చీకటి గదులు, బావులు, దేవాలయాలను సందర్శించారు. అలాగే 44, 67వ జాతీయ రహదారులను పరిశీలించారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ జి.పుణ్యవతి, ఎంపిడిఓ డి.ప్రభాకర్ నాయక్, ఆర్ఐ హనుమాన్‌ప్రసాద్, విఆర్ఓ టి.సురేంద్ర, సర్పంచి ఆర్.గురుమస్తాన్, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు చౌదరి విజయభాస్కర్, తదితరులు ఉన్నారు.

మొక్కలు నాటిన 'గేట్స్' విద్యార్థులు

ప్రజాశక్తి-గుత్తి

పట్టణ శివారులోని గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పెద్దవడుగూరు మండలంలోని గుత్తి అనంతపురం గ్రామంలో ఏడు రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక శిబిరాలు ఆదివారం ముగిసాయి. వారం పాటు విద్యార్థులు యోగా, ధ్యానం, మానసిక ఆరోగ్యం, తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటారు. ఉత్తమ సేవలందించిన వాలంటీర్లను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచి మురళీధర్‌రెడ్డి, ఎంఇఒ రాముడు, హెచ్ఎం చిదంబరరెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్, ఎన్ఎస్ఎస్ అధికారి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న 'గేట్స్' విద్యార్థులు


నాయకులతో కలిసి నల్లలమ్మ జాతరకు వెళ్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

నల్లలమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి-శింగనమల

మండలంలోని కల్లుమడి గ్రామంలో ఆదివారం నల్లలమ్మ జాతర మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆమె ఆకాంక్షించారు. కాసేపు జాతరకు వచ్చిన భక్తజనంతో ముచ్చటించారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ యార్డ్ ఛైర్మన్ దండు శ్రీనివాసులు, మండల కన్వీనర్ గోరంట్ల మారుతి నాయుడు, సింగిల్‌విండో ప్రెసిడెంట్ గుర్రం లక్ష్మీనారాయణ, నాయకులు లాయర్ ఈశ్వర్‌రెడ్డి, గుప్తా ఆదినారాయణ, ఆయకట్టు ప్రెసిడెంట్ గార్లదిన్నె సత్యనారాయణ, అనిల్‌కుమార్‌యాదవ్, రమణ యాదవ్, బండి పరశురాముడు, రాగే పరశురాముడు, తదితరులు ఉన్నారు.

బోయరెడ్డిపల్లిలో కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి-యాడికి

మండలంలోని బోయరెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం పోలీసులు విస్తృత స్థాయిలో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. యాడికి సిఐ శ్రీనివా సులు ఆధ్వర్యంలో తాడిపత్రి టౌన్, రూరల్, పప్పూరు, పెద్దవడుగూరు ఎస్ఐలు సిబ్బందితో కలిసి గ్రామంలోని అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లలో సోదాలు చేశా రు. పాత కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న వ్యక్తుల నివాసాలను పరిశీలించారు. అయితే ఎక్కడా ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లేదా వ్యక్తులు కనిపించ లేదని పోలీసులు తెలిపారు. గ్రామాల్లో శాంతి భద్రతలను పరిరక్షించడంలో భాగంగా ఇటువంటి తనిఖీలు కొనసాగుతాయని పోలీసులు వెల్లడించారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైరు చోరీ

ప్రజాశక్తి-బెళుగుప్ప

మండలంలోని రామసాగరం గ్రామంలో శనివారం రాత్రి వ్యవసాయ తోటల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో గుర్తు తెలియని వ్యక్తులు కాపర్ వైర్లు దోచుకెళ్లారు. అధికారులు, పోలీసులు తెలిపిన వివరాలు.. రామసాగరం గ్రామంలోని వ్యవసాయ తోటల్లో దుండగులు 3 విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని కాపర్ వైరు ఎత్తుకెళ్లారన్నారు. వాటిలో ఒకటి ప్రభుత్వానికి చెందినది కాగా మరో రెండు రైతులవి అన్నారు. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌లో రూ. 40 వేలు విలువ చేసే కాపర్ వైరు ఉంటుందని తెలిపారు. విద్యుత్ శాఖ అధికారుల ఫిర్యాదు మేరకు శిక్షణ ఎస్ఐ మహేష్, సిబ్బంది నాగభూషణం సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

వైసిపిని మరింత బలోపేతం చేద్దాం

ప్రజాశక్తి-కుందుర్పి

నియోజకవర్గంలో వైసిపిని మరింత బలోపేతం చేద్దామని ఆ పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాదినేని ఉమామహేశ్వరనాయుడు పిలుపునిచ్చారు. వైసిపి ప్రచార కార్యదర్శి ఓబులేష్ పిలుపుమేరకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఆదివారం కుందుర్పిలో ఫ్రెండ్స్ టీ కేఫ్‌ను ప్రారంభించి మాట్లాడారు. పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి, ఎస్సీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ నాగరాజు, రాష్ట్ర బీసీ సెల్ సెక్రటరీ ఈ.రాము, కోఆప్షన్ మెంబర్ ముజువుల్లా, సర్పంచులు మారుతీశ్వర రామ్మూర్తి, మసాలా జగన్, నాయకులు సి.మర్రిస్వామి, హనుమంతరాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కుందుర్పిలో ఫ్రెండ్స్ టీ కేఫ్ ప్రారంభించిన మాదినేని ఉమా మహేశ్వర నాయుడు

దళితవాడలను విస్మరించిన ప్రభుత్వం

ప్రజాశక్తి-శెట్టూరు

దళితవాడల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎస్సీ, ఎస్టీ జెఎసి కళ్యాణదుర్గం తాలూకా అధ్యక్షుడు చెలిమప్ప విమర్శించారు. మండలంలోని యాటకల్లు గ్రామంలో ఆదివారం ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లయినా దళితుల తలరాతలు మార్చేవారు లేరనిఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి వ్యక్తికీ భూమి, విద్య, ఉద్యోగం ఉండాలనేది రాజ్యాంగం కల్పించిన హక్కు అని గుర్తుచేశారు. అయితే నేటికీ చాలా ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో డ్రెయిజీలు, సీసీరోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో హామీలిచ్చి ఓట్లు దండుకున్నాక అధికార, ప్రతిపక్ష పార్టీలు హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. ఇదే నిర్లక్ష్యం కొనసాగితే ఉద్యమాలబాట పడతామని హెచ్చరించారు.

మార్కెట్ సంతల ఆదాయం రూ. 3.4లక్షలు

అనంతపురం : నగరంలోని గుత్తి రోడ్డులో ఉన్న మార్కెట్ యార్డులో ఆదివారం నిర్వహించిన పశువుల సంతల ద్వారా రూ. 3,40,200 ఆదాయం వచ్చినట్లు యార్డ్ కార్యదర్శి రాఘవేంద్రకుమార్, సూపర్‌వైజర్ కిషోర్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. గొర్రెలు, మేకల సంత ద్వారా రూ. 2,08,400, పశువుల సంత నుంచి రూ. 1,31,800 వచ్చిందన్నారు.

శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు



అమృత కూచిపూడి డాన్స్ అకాడమీ బృందం నృత్య ప్రదర్శన

అనంతపురం : సంస్కృతి, సంప్రదాయాల సమాహారం శిల్పారామం అని పరిపాలనాధికారి పి.శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం నగర శివారులోని శిల్పారామంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అందులో అమృత కూచిపూడి డాన్స్ అకాడమీ అనంతపురం బృందం చేసిన క్లాసికల్ నృత్య ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో కళాకారులు లయ, యక్షిత, లాస్యప్రియ, జనని, నిహారిక, రిత్విక, జాగృతి, ప్రియ, అన్విక, మేమిత, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకునికి పరామర్శ

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

స్థానిక ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న ఐటిడిపి మండల కోఆర్డి నేటర్ లోకేష్‌ను ఆదివారం టిడిపి మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, స్థానిక నాయకులు పరామర్శించారు. లోకేష్ పది రోజుల క్రితం ప్రమాదానికి గురవగా ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి పొందుతున్నారు. ఈ విషయం తెలియడంతో పాలబండ్ల శ్రీరాములు వారింటికి వెళ్లి లోకేష్‌ను పరామర్శించి కుటుంబ సభ్యులకు రూ. 13వేలు అందజేశారు. మీకు ఎల్లవేళలా పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచి సందీప్, నాయకులు జితేంద్రగౌడ్, కేశవరెడ్డి, ఎస్ఎంసి ఛైర్మన్ మల్లికార్జున, అల్లాబకాష్, బోయ పరమేష్, వడ్డే వెంకటేశులు, శివప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఐటిడిపి మండల కోఆర్డినేటర్ లోకేష్‌ను పరామర్శిస్తున్న శ్రీరాములు, నాయకులు

ట్రాక్టర్, బైక్ ఢీ.. వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

ట్రాక్టర్, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. తాడిపత్రి రూరల్ అప్‌గ్రేడ్ పోలీసులు తెలిపిన వివరాలు.. బాల వెంకటనారాయణ అనే వ్యక్తి శనివారం రాత్రి తాడిపత్రి నుంచి బైక్‌పై వెళ్తూ మండలంలోని పులి ప్రొద్దుటూరు గ్రామ సమీపంలో ఉన్న వేర్‌హౌస్ వద్ద తాడిపత్రి-గుత్తి ప్రధాన రహదారిపై ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొన్నాడు. దీంతో తీవ్రంగా గాయపడి స్పృహ కోల్పోయి పడి ఉండగా గమనించిన స్థానికులు 108 వాహనం ద్వారా పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.